క్లుప్తంగా

తప్పులు దొర్లకుండా చూడండి



తెనాలిఅర్బన్: ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఆదేశించారు. అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, తహసీల్దార్ గోపాలకృష్ణ, బీఎల్‌వోలు మున్సిపల్ కార్యాలయంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు వంటి వాటిపై సూచనలు ఇచ్చినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

దస్తావేజు లేఖరుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లిపర: రిజిస్ట్రేషన్ సమయంలో ప్రజలు, దస్తావేజు లేఖరులు ఎదుర్కొంటున్న 9 రకాల సమస్యలను పరిష్కరించాలంటూ కొల్లిపర మండలంలోని దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ శుక్రవారం స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ ఆదినారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దస్తా వేజు లేఖరులు మాట్లాడుతూ ఆధార్ ఐరిష్, బయోమెట్రిక్ గాని పనిచేయని వారికి, వృద్ధులకు గతంలో మాదిరిగానే వారి కుటుంబ సభ్యుల పేరున పవర్ ఆట స్టేషన్ డాక్యుమెంట్ మాన్యువల్‌గా చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని డ్యాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

రహదారుల వెంట పిచ్చిమొక్కలు తొలగించండి

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట పిచ్చిమొక్కలు లేకుండా చూడాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు సూచించారు. 40వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎం స్కూల్‌లో పిచ్చిమొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల వెంట పిచ్చిమొక్కలు ఉండటం వలన ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పర్యావరణానికి మొక్కలు దోహదం

తెనాలిఅర్బన్: పర్యావరణానికి మొక్కలు దోహదపడతాయని రక్షణ సైన్యం సంస్థ డివిజనల్ కమాండర్ గేరా థామస్ పేర్కొన్నారు. రక్షణ సైన్యం సంస్థ భారతదేశంలో ప్రారంభించి 143 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఐతానగర్‌లోని చర్చి ఆవరణలో శుక్రవారం జెండాను ఎగురవేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గేరా సీయోను కుమారి, మేజర్ క్రీస్తుదాసు, మేజర్ రాజకుమారి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, ఆశీర్వాదం పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ఉండాలి

తెనాలిఅర్బన్: క్షయవ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ సూచించారు. టీబీ ముక్తాభారత్ అభియాన్ ఇంటెన్సీఫైడ్ క్యాంపెయిన్-జన్ భాగా దారి కార్యక్రమంలో భాగంగా చెంచుపేట డొంక రోడ్డు లోని చర్చిలో శుక్రవారం టీబీ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్ని చెప్పారు. జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఉచి తంగా పరీక్షలు చేయడంతో పాటు వ్యాధి సోకిన వారికి మందులను కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు రాజు, అప్పారావు, వైద్య సిబ్బంది గీతా, వాణి, లక్ష్మీ, దిలీప్, వనజ, లీలావతి, తదితరులు ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

అమర్తలూరు(వేమూరు): గడ్డి మందు తాగి నార్ల జగన్మోహన్‌రావు (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామానికి చెందిన నార్ల జగన్మోహనరావు ప్రమాదవశాత్తూ కింద పడటం వల్ల ఎడమ చేతికి గాయం అయింది. నొప్పిని భరించలేక మనస్థాపంకు గురయిన జగన్మోహనరావు గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో గడ్డి మందు తాగాడని ఎస్ఐ రవితేజ తెలిపారు.

పన్ను ఎగవేతదారులపై కొరడా

- తెనాలిలో ప్రారంభమైన సర్వే
- వచ్చే నెల 10వ తేదీలోపు పూర్తి చేసేందుకు సన్నాహాలు
- ఇప్పటికే 2500 భవనాలను గుర్తించిన ఉద్యోగులు



సర్వే చేస్తున్న మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: పట్టణంలో పన్నుల ఎగవేతదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణంలోని ప్రతి ఇంటిని పురపాలక సంఘ పరిధిలోని రెవిన్యూ, సచివాలయ ఉద్యోగులు జల్లెడ పడుతూ ప్రతి భవనానికి పన్నులు వేసారా లేదా అనేదానిపై సర్వే చేస్తున్నారు. తెనాలిలో 20రోజుల క్రితం ప్రారంభమైన అండర్, అన్ ఎసెస్‌మెంట్‌ల సర్వేలో పన్నులు వేయని 2,500 భవనాలను ఇప్పటి వరకు గుర్తించారు. సర్వే పూర్తి అయ్యేనాటికి దీని సంఖ్య పది రెట్లు పెరగవచ్చనే అంచానాలలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. దీనివల్ల మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

పట్టణంలో సుమారు 1.60వేల మంది జనాభా నివశిస్తున్నారు. గుంటూరు, విజయవాడ, రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉండటం ... ప్రశాంతమైన వాతావరణం ఉండటం... నీటికొరత లేకపోవటం, లివింగ్ కాస్ట్ తక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల ఎక్కువ మంది ఇక్కడ నివశించేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే గుంటూరు తర్వాత ఇది అతి పెద్ద పట్టణంగా రూపుదిద్దుకోవటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తెనాలి మున్సిపాలిటీకి సెలక్షన్ గ్రేడ్ కూడా ప్రకటించారు.

ఆదాయంలో ఘనం

పట్టణంలో ప్రస్తుతం మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం 37,490 నివాస గృహాలు ఉన్నాయి. ఇవి కాకుండా సుమారు రెండు వేలకుపైగా ఖాళీ స్థలాలు ఉంటాయి. వీటికి మున్సిపల్ అధికారులు ఇంటి పన్నులు, ఖాళీస్థల పన్నులను ఏడాదికి రెండు సార్లు విధించి వసూలు చేస్తుంటారు. ఇంటి పన్నుల ద్వారా ఏడాదికి రూ.24 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ప్రతి ఏడాది సుమారు 400 వరకు నూతన భవనాలు నిర్మిస్తుంటారు. వీటికి ఇంటి పన్నులు వేసి వసూలు చేస్తుంటారు.

సర్వేలో వెలుగు చూస్తున్న పన్ను ఎగవేతదారులు

తెనాలి పురపాలక సంఘ రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో 20 రోజుల క్రితం సచివాలయ ఉద్యోగుల సహకారంతో ప్రారంభించిన ఇంటింటి సర్వేలో పన్ను ఎగవేతదారులు వెలుగు చూస్తున్నారు. ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి డోర్ నెంబర్‌తో పాటు ఎసెస్‌మెంట్ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అలాగే ఎన్ని అంతస్తుల భవనం అన్ని ఫ్లోర్‌లకు పన్నులు వేశారా లేదా అనే విషయాలను కూడా సేకరిస్తున్నారు. అలాగే సర్వే చేసిన ఇంటి ముందు ఎసెస్మెంట్ నెంబర్‌ను ఇళ్ల ముందు రాస్తున్నారు. తెనాలి పట్టణంలో ఇప్పటి వరకు 12 వేల ఇళ్లను పరిశీలిస్తే వాటిలో అదనపు అంతస్తులు నిర్మించి పన్నులు వేయించుకోనివి, నూతనంగా నిర్మించిన భవనాలు 2,500 వెలుగు చూసినట్లు సమాచారం. సర్వే పూర్తి అయ్యే నాటికి దీని సంఖ్య పది రెట్లు అయ్యే అవకాశం ఉంది.



ఎసెస్మెంట్ నెంబర్‌ను ఇంటి బయట రాస్తున్న ఉద్యోగులు

చేతివాటం ప్రదర్శించి పన్నులు వేయని ఆనాటి అధికారులు.

తెనాలి పట్టణంలో జరుగుతున్న సర్వేలో ఎక్కువ భవనాలు గతంలో నిర్మించినవే. ఈవిషయం ఆనాటి రెవెన్యూ విభాగంలో పనిచేసిన అధికారులకు తెలిసినా వారు చూసీచూడనట్లు వ్యవహరించినట్లు తెలిసింది. అంతేకాకుండా ఆనాడు రెవెన్యూ విభాగంలో పనిచేసిన అధికారులు అవినీతికి పాల్పడి భవన నిర్మాణాల విషయం తెలిసిన మిన్నకున్నారనే ఆరోపణ వినిపిస్తోంది. మొత్తం మీద తెనాలిలో చేపట్టిన అండర్, అన్ ఎసెస్‌మెంట్ సర్వే వల్ల మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

సర్వేకు సహకరించాలి



తెనాలి పట్టణంలో అండర్, అన్ ఎసెస్‌మెంట్‌ల సర్వే జరుగుతుంది. సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి సర్వేను చేస్తున్నారు. ఇప్పటికే పన్నులు వేయని కొన్ని భవనాలు గుర్తించాం. వాటికి ఈఏడాది మార్చి నుంచి పన్నులు వేస్తున్నాం. వచ్చే నెల10వ తేదీలోపు సర్వేను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అదనంగా రూ.85 లక్షల ఆదాయం వచ్చింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

– ఎస్‌వి.రాంప్రసాద్, రెవెన్యూ అధికారి, తెనాలి పురపాలక సంఘం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నిరసన

తెనాలి: ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక సేవాట్రస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తెనాలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, అక్కడే నిరసన నినాదాలు చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం మొండి వైఖరిని తీవ్రంగా ఖండించారు. పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేదలకు విద్య, వైద్యం దూరమవుతాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత జీవోను వెంటనే రద్దు చేయాలని, విద్యార్థుల భవిష్యత్‌లో చలగాటం ఆడుకోవద్దని దళిత నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, కట్టేవరపు దేవానంద్, దేవరకొండ శంకరరావు, పొట్లూరి అశోక్, కుర్రా జస్వంత్ యాదవ్, పెదలంక వెంకటేశ్వర రావు, షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనిల్, పిల్లి ప్రేమరాజు, పినపాటి రవికిరణ్, నీట్ట బాలు, కమాదుల స్వామి, బత్తుల గోపి, కె.స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వేదిక సేవాట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని నాలాది బుజ్జిబాబు పర్యవేక్షించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

మెడికల్ కళాశాలలను ప్రవేట్‌పరం చేస్తే ఉద్యమిస్తాం

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివనాగరాజు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీ విధానంలో ప్రవేట్‌పరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివనాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి మండలిలో దీనికి ఆమోదం తెలపడాన్ని వారు ఖండించారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 నూతన మెడికల్ కాలేజ్‌లను తీసుకువచ్చారు. వీటిని ప్రవేట్‌పరం చేయడం వలన పేద విద్యార్థులు, వైద్య విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తుంగ బాలస్వామి, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కృష్ణబాబు, సీనియర్ నాయకులు బొల్లిముంత కృష్ణ, రవి, యశ్వంత్, ఇరిమియా, దుర్గా, తేజ, పండు, తదితరులు పాల్గొన్నారు.



శివాజీచౌక్‌లో ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుందాం

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో జరిగే అనాధికార కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనాధికార కట్టడాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని వివరించారు. ఇటీవల నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మిన్‌స్ట్రేషన్ డైరెక్టర్లు వీటిపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్లాన్లు లేకుండా నిర్మాణాలు జరిపిన భవనాలను కూల్చివేయాలని ఆదేశించినట్లు చెప్పారు. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ (బీపీఎస్) పథకం ఆగస్టు 30వ తేదీ లోపు నిర్మించిన భవనాలకే వర్తిస్తుందనే మౌలిక ఆదేశాలు వచ్చాయన్నారు. పట్టణంలో అనధికారంకంగా నిర్మించిన భవనాలకు నోటీసులు ఇవ్వడంతో పాటు శ్లాబులను కూల్చివేయనున్నట్లు ప్రకటించారు. అసిస్టెంట్ సీటీ ప్లానర్ వాణి మాట్లాడుతూ ఇప్పటికే అనధికారికంగా నిర్మించి అనేక భవనాలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనాధికారక లేఅవుట్‌లను క్రమబద్ధీకరించేందుకు జీవో విడుదల చేసిందని చెప్పారు.

అనధికారికంగా లేఅవుట్‌లు వేసిన వారు, వాటిని కొనుగోలు చేసిన వారు, వెంటనే ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. తెనాలి పట్టణంలో ఎవరు అనధికారికంగా భవనాలు నిర్మించవద్దని సూచించారు. ప్లాన్‌లకు దరఖాస్తు చేసుకున్న కొద్దిరోజులోనే దానిని ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలు, చైన్‌మ్యాన్‌లు పాల్గొన్నారు.

తెనాలిలో యూటీఎఫ్ రణభేరి జాత

- ప్రదర్శనలో భారీగా పాల్గొన్న ఉపాధ్యాయులు
- కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించటం లేదని నిరసన



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల ప్రదర్శనను తెనాలిలో శుక్రవారం భారీగా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి 15 నెలలు గడిచినా ఏ ఒక్క సమస్యకు తగిన పరిష్కారం లభించకపోవటంతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడలో వేలాదిమందితో 'రణభేరి'ని నిర్వహించనున్నారు. ఇందుకు సన్నాహకంగా సెప్టెంబరు 15 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అయిదు రకాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేయాలని యూటీఎఫ్ నిర్ణయించింది. అందులో భాగంగా రణభేరి జాతాను శుక్రవారం గుంటూరులో ప్రారంభించి, తెనాలిలో ముగించారు. ఈ ప్రదర్శనలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతోందని ఆరోపించారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వమే విద్యావ్యవస్థను బలహీనపరచిందన్నారు. తాత్కాలిక నియామకాలు మినహా శాశ్వత నియామకాలు లేని వ్యవస్థగా పర్యవేక్షణ వ్యవస్థ తయారైందని, బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడునెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడునెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. విద్యాహక్కు చట్టం, ప్రపంచ బ్యాంక్ పథకం అమలుపేరుతో మూడోవంతు ప్రాథమిక పాఠశాలలు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూల్లుగా మారాయనీ, హైస్కూళ్లలో టీచర్ల సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. ఈ సమస్యలతో ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించటం లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.మనోహర్ అన్నారు. ఈనెల 25న విజయవాడలో జరగనున్న రణభేరిని విజయవంతం చేయాలని కోరారు. ప్రదర్శనలో యూటీఎఫ్ ప్రచురణల కమిటీ కన్వీనర్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, సహ అధ్యక్షులు జీవీ నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, గౌరవ అధ్యక్షుడు పీవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె.సాంబశివరావు, కె.కామాక్షి, ఆదినారాయణ, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ఎల్ మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.కేదార్‌నాథ్, రాష్ట్ర కౌన్సిలర్ ఆదిలక్ష్మి, బసవేశ్వరరావు, మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర: విద్యుత్ లైన్ల మరమ్మతులు, పెద్ద విద్యుత్ లైన్ ఏర్పాటు కొరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ కోత నిర్వహిస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.శుక్రవారం ఆయన విద్యుత్ కోత గురించి మాట్లాడుతూ అన్నవరం, హనుమాన్ పాలెం, బొమ్మువానిపాలెం, తూములూరు, దావులూరు, అత్తోట, కొల్లిపర ఆయా గ్రామాల్లో త్వరలో పెద్ద విద్యుత్ లైన్ ఏర్పాటు కొరకు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు కావున ఆయా గ్రామాల్లోని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

జూదరుల అరెస్ట్

తెనాలిరూరల్: డ్రోన్‌సాయంతో జూదరులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తెనాలి రూరల్ మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని సంగమేశ్వర స్వామి గుడికి సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు డ్రోన్ సాయంతో గుర్తించారు. రూరల్ ఎస్ఐ ఆనంద్, సిబ్బంది సాధారణ దుస్తుల్లో అక్కడికి వెళ్లి 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,62,450 నగదు, రెండు బైక్‌లను స్వాధీన పర్చుకున్నారు. అక్కడ పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్న చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన దుర్గా, మరో ఇంకొక నలుగురు పరారీలో ఉన్నారు. మొత్తం 17 మంది మీద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తెనాలిలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం

తెనాలిఅర్బన్: స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాల వద్ద నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా మూడవ శనివారం దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు.

29 నుంచి యజుర్వేద పారాయణ యజ్ఞం

తెనాలిరూరల్: బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వేద వేదాంగ పరిషత్ దార్శనిక తత్వవేత్త పండిత గోపదేవ్ శాస్త్రి 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 29 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు యజుర్వేద పారాయణ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెనాలిలో తెలిపారు. కూచిపూడిలోని ఆర్య సమాజ్ ప్రాంగణంలో జరిగే కార్యక్రమాల్లో ప్రతి రోజు యజుర్వేద పారాయణం, భజనలు, వ్యాఖ్యానం ఉంటుందని చెప్పారు.

అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యం



మాట్లాడుతున్న సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి

తెనాలిఅర్బన్: దోమల నియంత్రణపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో మారీసుపేట, పినపాడు, శాంతినగర్‌లలో దోమల నియంత్రణ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉండే నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. అవి లేకుండా చూసుకోవాలన్నారు. ఇవి కుట్టడం వలన జ్వరాలు, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తెనాలి పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఉండే పాత కూలర్లు, ఫ్రిజులు, గాబులు వంటి వాటిని ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మండల మలేరియా సబ్‌యూనిట్ అధికారి వంగాల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

తాపీ ధర్మారావు జయంతి అధికారికంగా నిర్వహించాలి



గోపీచంద్‌ను సత్కరిస్తున్న అతిథులు

తెనాలి: ప్రముఖ రచయిత, తెలుగు భాషా పండితుడు, హేతువాది తాపీ ధర్మారావు జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. సత్యం శివం సుందరం సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నాజరుపేటలోని రామాలయంలో జరిగిన సభకు సేవాసంస్థ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ అధ్యక్షత వహించారు. తాపీ ధర్మారావు జయంతిని ప్రభుత్వం తెలుగు మాధ్యమాల దినోత్సవంగా ప్రకటించడం సంతోషమని చెబుతూ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తూ సీనియర్ పాత్రికేయులను సత్కరించి ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. తాపీ ధర్మారావు ఎందరికో స్ఫూర్తినీయులని, సమాజంలోని అనేక అంశాలను ఆ రోజుల్లోనే తన రచనల ద్వారా ఆయన ప్రస్తావించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెనాలికి చెందిన పాత్రికేయుడు యం.గోపీచంద్‌కు తాపీ ధర్మారావు స్మారక పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పేటేటి రవికుమార్, ప్రసాదం శ్రీనివాసరావు, తన్నీరు కళ్యాణ్ కుమార్, శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం, పెద్దిశెట్టి హనుమంత రావు, రెడ్డి ఉమామహేశ్వరరావు, విష్ణుమొలకల భీమేశ్వర ప్రసాద్, నాగమోతు మణికంఠ, కొప్పరాజు విజయసారథి పాల్గొన్నారు.

చైతన్య దీప్తి తాపీ ధర్మారావు

తెనాలి: అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని సామాజిక చైతన్యానికి కృషిచేసిన మహోన్నతుడు తాపీ ధర్మారావు అని శుక్రవారం జరిగిన సంస్మరణలో వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, తెనాలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో ప్రముఖ రచయిత తాపీ ధర్మారావును సంస్మరణను ఆయన జయంతిరోజున జరిపారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లి ముంత కృష్ణ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత ఎంవీ రఘునాధరావు మాట్లాడుతూ వ్యవహారిక భాష అభివృద్ధికి కృషిచేసిన ధర్మారావు ప్రజాచైతన్యానికి పలు రచనలు చేశారని సోదాహరణంగా చెప్పారు. 'అరసం' జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ మాట్లాడుతూ ప్రజాజీవన విధానాన్ని తాపీ ధర్మారాలు తన రచనల్లో ఇమిడ్చి జనాభ్యుదయానికి కృషిచేశారని చెప్పారు. సభలో లక్కరాజు లక్ష్మణరావు తన ప్రసంగంలో తాపీ ధర్మారావు సినీ రచనలు వివరించారు. 'ఇస్కఫ్' సభ్యురాలు శ్రీదేవి, సీపీఐ తెనాలి నియోజకవర్గ సహాయ కార్యదర్శి తుంగ బాలస్వామి మాట్లాడారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

మహిళలు, చిన్నారులకు వైద్య సేవలు

వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్.వి.సుబ్బారావు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సి.హెచ్.వి. సుబ్బారావు

తెనాలిటౌన్: అధిక వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్.వి. సుబ్బారావు పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శుక్రవారం స్వస్త్ నారీ స్వశక్తి అభియాన్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు పాల్గొని మహిళలు, చిన్నారులకు వైద్యసేవలు అందించారు. దాదాపు 150 మంది పైబడి మహిళలు పాల్గొని వైద్యసేవలు పొందారు. డాక్టర్ సుబ్బారావు పాల్గొని మహిళలకు బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ధూళిపాళ్ళ పవన్‌కుమార్, ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి, నన్నపనేని లింగారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైయిన్‌లు మాకొద్దు

- కొలకలూరు బీసీ కాలనీలో స్థానిక ప్రజల ఆందోళన
- అధిక వర్షాలకు కాలనీ నీట మునిగి అంటువ్యాధులు ప్రబలుతున్నట్టు ఆరోపణ
- డ్రైయిన్ల నిర్మాణం నిలిపివేయాలని అధికారుల ఎదుట నిరసన



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు బీసీ కాలనీలో ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ఆదిలోనే అరిష్టాలు ఎదుర్కొంటోంది. గత 20 రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు మ్యాజిక్ డ్రెయిన్‌లలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. బీసీ కాలనీలో ప్రజలు దుర్గంధం భరించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ మొత్తం లోతట్టు ప్రాంతం కావడం వలన రోడ్ల వెంబడీ మురుగు నీరు నిలిచి వ్యాధులు ప్రబలుతున్నాయి. 60 మీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. అధిక వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిలిచి ప్రధాన పైప్‌లైన్ గుండా సక్రమంగా మురుగుపారుదల కాకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచి వర్షపు నీరు దోమలకు నిలయంగా మారింది. మ్యాజిక్ డ్రెయిన్లు మాకొద్దంటూ శుక్రవారం గ్రామస్తులు కాలనీలో ఆందోళన నిర్వహించారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని సర్దిచెప్పిన వినకపోవడంతో సమాచారాన్ని ఎంపీడీవో అత్తోట దీప్తికి తెలియజేశారు. గ్రామానికి చేరుకున్న ఎంపీడీవో యుద్ధ ప్రతిపాదికన కాలనీలోని మురుగునీరు బయటకు పంపే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సురక్షిత గ్రామాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మై ఛాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎన్. అనురాధ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన ల్యాప్ సంస్థ కో-ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహహింస లేని గ్రామాలను 'సురక్షిత గ్రామాలు' అంటారన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం మహిళా కార్యదర్శులు మహాలక్ష్మి, రత్నకుమారి, ల్యాంప్ సంస్థ ప్రతినిధి టి మంగయ్య, ఉపాధ్యాయులు అమర్నాథ్, విద్యార్థులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, ఆషిమూన్, స్వరూప, ప్రశాంతి, చింతమ్మ పాల్గొన్నారు.